సర్కారు తీరుపై మండిపడ్డ గౌరమ్మ

ప్రచార రథం వద్ద కళాకారులతో చిరు వ్యాపారి వాగ్వాదం

సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన గౌరమ్మ మాటలు

కొత్తగూడెం బస్టాండ్ వద్ద ప్రభుత్వ తీరుపై అభ్యంతరం తెలిపిన పండ్ల వ్యాపారి గౌరమ్మ

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ) : 'ఏం చేసిం దమ్మా.. కాంగ్రెస్ ప్రభుత్వం. పింఛన్లు లేవు.. మీ లేవు. బస్సుల్లో అంతా ఆడోళ్లే ఎక్కుతున్నారు' అని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పండ్ల వ్యాపారి గౌరమ్మ కొద్ది సేపు హల్‌చల్ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలపై సాంస్కృతిక కళాకారులు ప్రచారం రథంతో కొత్తగూడెం బస్టాండ్ వద్ద గురువారం ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అక్కడే పండ్లు విక్రయించే గౌరమ్మ ఒక్కసారిగా వారితో వాగ్వాదానికి దిగింది. పై విధంగా ఆగ్రహంతో ప్రశ్నించింది. 'ఓటు ఎందుకు వేశావు' అని కళాకారులు ప్రశ్నించగా.. 'ఓటు వేసి తప్పు చేశాను' అని చెంప లేసుకుంది. 'అదే కేసీఆర్ ఉంటే.. ఏదో ఒకటి చేసి అన్నీ ఇచ్చేవారు' అని కొద్దిసేపు వారితో వాగ్వాదానికి దిగింది. దీంతో అక్కడున్న ఆమెను చాలా మంది ఎందుకమ్మ అట్లా అన్నావు అని అడిగితే.. నాకు ఇబ్బంది అయింది. అందుకే అన్నానని చెప్పింది. దీంతో అక్కడే ఉన్న ఒక వ్యక్తి దీనిని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు పెట్టడంతో ఆమె మాటలు వైరల్ అయ్యాయి. ఒక వృద్ధురాలు నోటి వెంట కేసీఆర్ పేరు రావడంతో అందరూ ఆలోచనలో పడ్డారు.

210 కిలోల గంజాయి పట్టివేత

భద్రాచలం, నవంబర్ 28: ఆంధ్రాలోని చింతూరు నుంచి కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని భద్రాచలం ఎక్సైజ్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఎక్సైజ్, ప్రొహిబిషన్ అసిస్టెంట్ కమిషనర్ జానయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చింతూరు నుంచి కారులో వస్తుండగా కూనవరం రోడ్‌లోని ఆర్‌టీవో చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానం వచ్చి కారును తనిఖీ చేశారు. ఇద్దరు వ్యక్తులతో పాటు కారులో గంజాయి లభ్యం కావడంతో వారిని విచారించగా మహారాష్ట్రకు చెందిన పాండక్ నాథ్, దత్తాత్రేయ వాంగ్‌మారేలు గంజాయిని చింతూరు నుంచి తీసుకువచ్చి మహారాష్ట్రలో విక్రయించేందుకు వెళ్తున్నామని తెలిపినట్లు పేర్కొన్నారు. కారులో రూ.56 లక్షల విలువైన గంజాయితో పాటు కారు, రెండు సెల్‌ఫోన్లు, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు వివరించారు. తనిఖీల్లో సీఐ రహీమున్నీసాబేగం, ఎస్సై సీతారామరాజు, సిబ్బంది ఎస్‌డి.అలీమ్, కె.బాబు, వి.వీరబాబు, రాజేష్, కిరణ్, లలిత, సుజాత పాల్గొన్నారు.

తొమ్మిది కేజీల గంజాయి పట్టివేత

టేకులపల్లి, నవంబర్ 28: మోటార్ సైకిల్‌పై గంజాయి తరలిస్తుండగా కారుకొండ క్రాస్ రోడ్ వద్ద గురువారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై పోగుల సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కారుకొండ క్రాస్‌రోడ్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా ద్విచక్ర వాహనంపై తిరుమలగిరి, కొడకండ్లకి చెందిన ఉదయ్‌కిరణ్, కోమటి భాస్కర్ అనే ఇద్దరు 9 కిలోల గంజాయితో సహా పట్టుకున్నారు. వారిని విచారించగా డొంకరాయి నుంచి కొడకండ్లకి గంజాయి తరలిస్తున్నామని తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్లాస్టిక్ వాడడం జీవనానికి ప్రమాదకరం

ఇల్లెందు, నవంబర్ 28: ప్లాస్టిక్ వాడకం జీవనానికి అత్యంత ప్రమాదకరమని ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ఇల్లెందు పట్టణంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో వ్యాపారస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ జీవనానికి అత్యంత ప్రమాదకారిణి అని, నిత్యజీవితంలో ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని కోరారు.

ఆదర్శంగా ప్రభుత్వ పాఠశాలల పనితీరు

దుమ్ముగూడెం, నవంబర్ 28: నాణ్యమైన విద్యా ప్రమాణాలు అందించడంలో, విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వ పాఠశాలల పనితీరు ఆదర్శంగా ఉందని నర్సాపురం కాంప్లెక్స్ నోడల్ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు అన్నారు. గురువారం నర్సాపురం కాంప్లెక్స్ పరిధిలోని గుర్రాలబైలు, లచ్చిగూడెం, నాగనగుంపు, పౌలూరిపేట, సింగవరం పాఠశాలలను హెచ్‌ఎంలు, సీఆర్‌పీలతో ఆకస్మికంగా సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉండి ఇంగ్లీష్ మాట్లాడటం, చదవడం చూసి ఆనందం వ్యక్తం చేశారు.

ఇంజినీర్ల బదిలీలపై విధి విధానాలు రూపొందించాలి

మణుగూరు టౌన్, నవంబర్ 28: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఇంజినీర్ల బదిలీలపై విధి విధానాలు రూపొందించాలని ఆ సంస్థ ఇంజినీర్ల అసోసియేషన్ బీటీపీఎస్ బ్రాంచి నాయకులు యాజమాన్యాన్ని కోరారు. ఈ మేరకు బీటీపీఎస్‌లో గురువారం చీఫ్ ఇంజినీర్ బిచ్చన్నకు యూనియన్ బ్రాంచి సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటీవ్ కార్యదర్శి బీ రవిప్రసాద్, రవితేజ వినతి పత్రాన్ని అందజేశారు.

మంత్రి సీతక్కకు వినతి

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 28: రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ సీతక్కకు లంబాడా హక్కుల పోరాట సమితి నాయకులు గురువారం వినతిపత్రం ఇచ్చారు. ఏజెన్సీలో వంద శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. రాజేష్ నాయక్, వట్టం ఉపేందర్, పొడుగు శ్రీనాథ్, చింత కృష్ణ, జంపన్న, సాయినాయక్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు సంఘంతో స్ట్రక్చర్ కమిటీ సమావేశం

కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 28: సింగరేణి ఇల్లెందు గెస్ట్ హౌస్‌లో డైరెక్టర్(పా) వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన గుర్తింపు సంఘం ఏఐటీయూసీతో 50వ స్ట్రక్చర్ కమిటీ సమావేశం గురువారం జరిగింది. కార్మికుల సమస్యలపై చర్చించింది. కవితానాయుడు, సురేష్‌బాబు, సుబ్బారావు, రఘురాంరెడ్డి, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేకాట జూదరులు అరెస్ట్

పాల్వంచ రూరల్, నవంబర్ 28: మండలంలోని తోగ్గూడెం శివారులో పేకాట శిబిరంపై రూరల్ ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం దాడి చేశారు. ఎనిమిదిమంది జూదరులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.32వేలు, ఆరు సెల్ ఫోన్లు స్వాధీనపర్చుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

'విద్యార్థులపట్ల నిర్లక్ష్యాన్ని సహించం'

పాల్వంచ, నవంబర్ 28: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో 48 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ తదితర కారణాలో మృతిచెందారని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం పట్టణ అధ్యక్షుడు జూపెల్లి దుర్గాప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన గురువారం పాల్వంచలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల మృతికి, అస్వస్థతకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. దీనిని తాము సహించబోమన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

కంటి రెప్పలకు.. కన్ను భారమైంది..!

తల్లిదండ్రులకు కన్న బిడ్డే బరువైంది..

వేరొకరికి అప్పగించారు..

అధికారులకు సమాచారం..

కేసుల నమోదుకు విచారణ..

ఇచ్చినట్లు ఒప్పుకున్న తండ్రి..

పుచ్చుకున్నట్లు అంగీకరించిన దంపతులు

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): కంటి రెప్పకు.. కన్ను భారమవుతుందా..? 'నీ సంరక్షణ బాధ్యతను చూడలేనంటూ' కను రెప్ప అచేతనంగా ఉండిపోతుందా..? చదవడానికి, వినడానికి ఇవి ఊహాతీత ప్రశ్నలుగానే అనిపించొచ్చు. కానీ, కన్నును 'భారం'గా భావించే కను రెప్పలు కూడా ఉంటాయన్న విషయాన్ని ఓ అమానవీయ ఘటన నిరూపించింది.

పసికందును వదిలించుకున్నారు

ఇది, నెల రోజుల క్రితం జరిగింది. లక్ష్మీదేవిపల్లి మండలం అశోక్‌నగర్ కాలనీకి చెందిన శివ దంపతులకు మూడు నెలల క్రితం పాప పుట్టింది. వారికి అప్పటికే ఓ పాప ఉంది. ఇద్దరు ఆడ పిల్లలు భారమనుకున్నారో, డబ్బుకు ఆశ పడ్డారో తెలియదు గానీ, అప్పటికి రెండు నెలల వయసున్న ఆ ఆడ పసికందును ఖమ్మం నగరానికి చెందిన వెంకటేశ్వర్లు-రేణుక దంపతులకు ఓ మధ్యవర్తి ద్వారా తండ్రి శివ అప్పగించాడు. నెల రోజులు గడిచింది. గుట్టుగా సాగిన ఈ వ్యవహారం.. ఐసీడీఎస్, ఐసీపీఎస్ అధికారులకు తెలిసింది. వారు రంగంలోకి దిగారు.

నేను ఇచ్చాను, వాళ్లు తీసుకున్నారు

పసి కందును అప్పగించిన తల్లిదండ్రులను, పుచ్చుకున్న దంపతులను, వీరికి మధ్యవర్తిగా వ్యవహరించిన దళారీని అధికారులు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందుకు అధికారులు హాజరుపర్చారు. తమ బిడ్డను తామే ఇచ్చామని తల్లిదండ్రులు, ఆ పసికందును తామే పుచ్చుకున్నామని ఆ దంపతులు రాతపూర్వకంగా అంగీకరించారు. ఇవ్వడం-పుచ్చుకోవడం తప్పేనని ఆ ఇద్దరు దంపతులు ఒప్పుకున్నారు. ఆ పసికందును కన్న తల్లికి కమిటీ అప్పగించింది. ఆ తర్వాత, ఆ పసికందును ఐసీడీఎస్ అధికారులకు స్వాధీనపర్చింది. పసికందును అప్పగించిన, స్వీకరించిన ఆ ఇద్దరు దంపతులపై కేసు నమోదుకు రంగం సిద్ధమైంది.

'విచారణలో మరిన్ని విషయాలు..'

ఈ వ్యవహారంపై డీసీపీఓ హరికుమారిని 'నమస్తే' వివరణ కోరింది. దీనికి ఆమె- ''పసికందు అప్పగింతపై నాలుగు రోజుల క్రితం మాకు సమాచారం వచ్చింది. మా సిబ్బంది విచారణకు వెళ్లారు. పసికందును అప్పగించిన, స్వీకరించిన దంపతులను కమిటీ ముందు హాజరుపరిచారు. ఆ ఇద్దరు దంపతులపై కేసు నమోదవుతుంది. విచారణలో మరిన్ని వివరాలు బయటకు వచ్చే అవకాశాలున్నాయి. అక్రమంగా దత్తత ఇవ్వకూడదు, పుచ్చుకోకూడబుడు. పసికందుల క్రయ విక్రయం చట్టరీత్యా నేరం'' అని చెప్పారు.

అమ్మా-నాన్నా..
నేను మీకు భారమయ్యానా..?!

మూడు నెలల వయసున్న ఆ పసికందు..
పెరిగి పెద్దదయిన తర్వాత,
తన తల్లిదండ్రులను ఇలాగే ప్రశ్నిస్తుందేమో..!

అమృతం లాంటి అమ్మ పాలను..
అమ్మ ఒడిలోని వెచ్చదనాన్ని
తనకు ఎందుకు దూరం చేయాలనుకున్నారని
నిలదీస్తుందేమో..!!

'నన్ను అమ్మారటగా..
నేనేమైనా సంతలోని సరుకునా..?'
అని, కన్నవాళ్లను కన్నీళ్లతో కడిగేస్తుందేమో..!!!

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న దిండిగాల రాజేందర్

ఇల్లెందు, నవంబర్ 28: తెలంగాణ సాధన కోసం తన ప్రాణాలు సైతం లెక్కచేయకుండా దీక్ష నిర్వహించిన తెలంగాణ సాధకుడు కేసీఆర్ చేసిన దీక్షకు గుర్తుగా కొత్తగూడెం జిల్లా కేంద్రంలో నిర్వహించే దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు, ఉద్యమనేత దిండిగాల రాజేందర్ అన్నారు. గురువారం ఇల్లెందు పట్టణం జగదాంబ సెంటర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 2009 నవంబర్ 29న తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ చచ్చుడో.. అనే నినాదంతో నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల ఆశనే తన ఆశయంగా తెలంగాణ ప్రజలకు ప్రత్యేక తెలంగాణ సాధన కోసం ఆమరణదీక్ష నిర్వహించిన మహా నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని కోరారు. సిలివేరి సత్యనారాయణ, లకావత్ దేవీలాల్, శీలం రమేష్, జాఫర్ హుస్సేన్, బావ్ సింగ్, డేరంగుల పోశం, నబీ, రాజేష్, శ్రీను, లలిత్ కుమార్ పాసి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం, నవంబర్ 28: కొత్తగూడెం జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగే దీక్షా దివస్‌ను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఆకోజు సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. నాడు తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో.. అనే నినాదంతో ఆమరణ దీక్ష చేపట్టి ఉద్యమానికి ఊపిరి ఊదిన నాయకుడు కేసీఆర్ అని, అనేక పదవులను సైతం త్యాగం చేసిన గొప్ప ఉద్యమనేత కేసీఆర్ అని కొనియాడారు. కార్యకర్తలు, నాయకులు, అనుబంధ సంఘాల బాధ్యులు, ఉద్యమకారులు పెద్దసంఖ్యలో తరలివెళ్లి జయప్రదం చేయాలని కోరారు.

మణుగూరు టౌన్, నవంబర్ 28: కొత్తగూడెంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జరిగే దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మణుగూరు పట్టణ, మండల కన్వీనర్లు కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్ కోరారు. మణుగూరులోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గం నుంచి వెయ్యి మంది వరకు రావాలని కోరారు. కార్యక్రమంలో బొలిశెట్టి నవీన్, నూకారపు రమేశ్, ఏనిక ప్రసాద్, తాళ్లపల్లి యాదగిరి గౌడ్, వట్టం రాంబాబు, ఆవుల నర్సింహారావు, అక్కి నర్సింహారావు, రషీద్, జక్కం రంజిత్, బర్ల సురేశ్, రేగులగడ్డ సుజాత, తురక రాంకోటి పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిబాపూలే వర్ధంతి

అశ్వారావుపేట టౌన్, నవంబర్ 28: జ్యోతీబా పూలే మహనీయుడు అని బీసీ సంఘం నాయకుడు పకీర్ అన్నారు. గురువారం జ్యోతిబా పూలే వర్ధంతిని స్థానిక రింగ్ రోడ్డు సమీపంలోని విగ్రహం వద్ద నిర్వహించారు. ప్రిన్సిపాల్ నిరోషా, నాయకులు అంకోలు వెంకటేశ్వరావు, కైలా శ్రీరాములు, త్రినాద్, రాజు పాల్గొన్నారు.

ఇల్లెందు రూరల్, నవంబర్ 28: మండల పరిధిలోని డీగ్రీ కళాశాలలో జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పూలే ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

పాల్వంచ, నవంబర్ 28: మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతిని తెలంగాణ ఎలక్ట్రిసిటీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు గురువారం కేటీపీఎస్ బీసీ అసోసియేషన్ హాల్‌లోనిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 28: పూలేకు బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ నివాళి అర్పించారు. బీఎస్పీ జిల్లా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

అదనపు ఎస్సైగా రామ్మూర్తి

అశ్వారావుపేట, నవంబర్ 28: అశ్వారావుపేట అదనపు ఎస్సైగా రామ్మూర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన అదనపు ఎస్సై శివరామకృష్ణ ఇటీవల చంద్రుగొండకు బదిలీ అయ్యారు. అయిన స్థానంలో కొత్తగూడెం కోర్టు మానిటరింగ్ సిస్టం విభాగంలో పని చేస్తున్న రామ్మూర్తిని ఉన్నతాధికారులు అశ్వారావుపేటకు బదిలీ చేశారు.

నేటి నుంచి ఓపెన్ పోరం తనిఖీలు ప్రారంభం

దమ్మపేట, నవంబర్ 28: మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై శుక్రవారం నుంచి సామాజిక తనిఖీలు ప్రారంభిస్తున్నట్లు ఈజీఎస్ ఏపీఎం వేముల సుధాకర్ గురువారం తెలిపారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి మొత్తం 818 పనులకు సంబంధించి ఈ తనిఖీలు చేపడతామని, మండలంలోని 31 పంచాయతీల్లో తనిఖీలు ఉంటాయని ఆయన తెలిపారు.

పీఎల్‌జీఏ వార్షికోత్సవాలపై మావోయిస్టుల లేఖ

చర్ల, నవంబరు 28: డిసెంబర్ 2 నుంచి 8 వరకు పీఎల్‌జీఏ వార్షికోత్సవాలను ఏరియా వ్యాప్తంగా ఘనంగా జరపాలని మావోయిస్టు పార్టీ చర్ల శబరి ఏరియా కమిటీ పిలుపునిచ్చింది. గురువారం మీడియాకు పంపిన లేఖలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన కగార్ యుద్ధాన్ని తిప్పికొట్టండి, దోపిడీ రహిత సమాజం కోసం యువకులు పీఎల్‌జీఏలో చేరాలని మావోయిస్టులు లేఖలో పెర్కొన్నారు.

వృద్ధులకు స్వెట్టర్లు పంపిణీ

భద్రాచలం, నవంబర్ 28: పరివర్తన యశోద ఫౌండేషన్ సేవాసమితి కార్యాలయంలో మహాత్మజ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా అప్పన్న దాసుబాబు సహకారంతో సంస్థ అధ్యక్షుడు కొమ్మగిరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దివ్యాంగులు, వృద్ధులకు గురువారం స్వెట్లర్లు పంపిణీ చేశారు.

పూనెం రమేష్‌ను కోర్టులో హాజరుపరచాలి

టేకులపల్లి, నవంబర్ 28: సీపీఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) జిల్లా కార్యదర్శి కామ్రేడ్ పూనెం రమేష్‌ను వెంటనే కోర్టులో హాజరుపరచాలని టేకులపల్లి మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు డి.ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో కోరారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ఆళ్ళపల్లి, నవంబర్ 28: పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని అనంతోగు చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని అనంతోగు గ్రామానికి చెందిన గలిగ రామారావు (30) తన భార్య నాగలక్ష్మితో బుధవారం ఇంట్లో గోడవపడి మనస్థాపంతో పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లి వైద్యం చేయించారు. మెరుగైన వైద్యం కోసం 108 లో కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.

చెకుముకి పోటీలో మండల విద్యార్థులు

టేకులపల్లి, నవంబర్ 28: చెకుముకి జిల్లా స్థాయి పోటీల్లో టేకుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. గురువారం కొత్తగూడెం సింగరేణి హైస్కూల్‌లో జన విజ్ఞాన వేదిక వారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు గీత, శ్రీహరిణి, హర్షితకు ప్రభుత్వ పాఠశాలలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి నగదు, సర్టిఫికేట్స్ అందజేశారు.

చర్లలో పిచ్చికుక్కల స్వైరవిహారం

చర్ల, నవంబర్ 28: మండలకేంద్రంలో కొద్దిరోజులుగా పిచ్చికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పిచ్చికుక్కల దాడిలో గాయపడినవారు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అధికారులకు విషయం తెలిపినా ప్రయోజనం లేకుండా పోయిందని గాయపడిన సిఆర్ కాలనీకి చెందిన చిప్పనపల్లి నాగేశ్వరరావు, కొడిపెగుంపుకు చెందిన పిచ్చమ్మ వాపోయారు. పిచ్చి కుక్కల బారి నుంచి ప్రజలను కాపాడాలని బాధితులు కోరారు.

లెనిన్‌కాలనీలో సామూహిక సీమంతాలు

చర్ల, నవంబర్ 28: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చర్ల(కొయ్యూరు)పరిధిలోని ఉంజిపల్లి ఉపకేంద్రంలోని లెనిన్‌కాలనీలో ఆదివాసీ మహిళలకు పీహెచ్‌సీ వైద్యబృందం గురువారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. హోమియో వైద్యురాలు డాక్టర్ పూజ గర్భవతులు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌కు సన్మానం

దుమ్ముగూడెం, నవంబర్ 28: దుమ్ముగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మాజీ జడ్పీటీసీ తెల్లం సీతమ్మ ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో సీతమ్మను తహసీల్దార్ అశోక్‌కుమార్, కార్యాలయ ఉద్యోగులు శాలువాలతో సత్కరించారు. ఆర్ఐలు వెంకటేశ్వర్లు, నర్సింహారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

పినపాక (కరకగూడెం), నవంబర్ 28: మండలంలోని గోపాలరావుపేట గ్రామంలో బుధవారం రాత్రి వల్లెపు సంపత్‌కు చెందిన పాడిగేదె విద్యుదాఘాతంతో మృతిచెందింది. పొలంలో విద్యుత్ స్తంభం నుంచి మోటారుకు కనెక్ట్ చేసిన తీగ గేదె కొమ్ములకు చుట్టుకుని తీగ తెగి విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందింది. పాడి గేదె విలువ రూ 50వేలు ఉంటుందని సంపత్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

అశ్వారావుపేట, నవంబర్ 28: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాన్‌తో పాటు ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు 25 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడకు తరలిస్తున్నారు. స్థానిక రింగ్ రోడ్డు సెంటర్లో గురువారం పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు తనిఖీలు చేయగా ట్రాలీ ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పిండిప్రోలు గ్రామానికి చెందిన మడికంటి రాము, లింగస్వామితో పాటు బియ్యం కొనుగోలు చేస్తున్న కాకినాడ వ్యాపారి మణికంఠపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై యయాతి రాజు తెలిపారు.

'చెకుముకి' టాలెంట్ టెస్టులో 'రుద్రంపూర్' ప్రతిభ

చుంచుపల్లి, నవంబర్ 28: జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులో రుద్రంపూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. మండల స్థాయిలో మొదటి బహుమతి సాధించిన పదవ తరగతి విద్యార్థిని సౌమ్య, 9వ తరగతి విద్యార్థిని ఇందు, 8వ తరగతి విద్యార్థి హరీష్.. జిల్లా స్థాయిలో కూడా విజయం సాధించారు. వీరిని హెచ్ఎం బాలాజీ, ఉపాధ్యాయులు అభినందించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చుంచుపల్లి, నవంబర్ 28: మండలంలోని రాంపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ మండె వీరహన్మంతరావు గురువారం ప్రారంభించారు. ఏవో రాజేశ్వరి, మానిటరింగ్ ఆఫీసర్ జయశ్రీ, సెక్రటరీ పాండ్ల సారయ్య తదితరులు పాల్గొన్నారు.

జిన్నింగ్ మిల్లులో కలెక్టర్ తనిఖీ

రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

కొత్తగూడెం టౌన్, నవంబర్ 28: సుజాతనగర్ మండలంలోని మంజిత్ కాటన్ జిన్నింగ్ మిల్లును కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పత్తి తేమ శాతాన్ని పరీక్షించారు. సీసీఐ కేంద్రంలోనే పత్తి విక్రయించాలని రైతులతో చెప్పారు. కొనుగోళ్లను పరిశీలించారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

కొత్తగూడెం క్రైం, నవంబర్ 28: కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ గురువారం తనిఖీ చేశారు. అధికారులతో మాట్లాడారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని, నేరాల నియంత్రణకు పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. అసాంఘిక శక్తులపై ప్రత్యేక నిఘా వేయాలని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇన్‌స్పెక్టర్ ముప్పారపు కరుణాకర్, ఎస్సై విజయ పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం

భద్రాచలం, నవంబర్ 28: భద్రాచలం దివ్యక్షేత్రంలోని బేడా మండపంలో అర్చకులు గురువారం స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్య బలిహరణ, నిత్యపూజలు జరిపారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి భానుమతి

మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి జీ.భానుమతి

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 28: గురుకులాల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి జీ.భానుమతి అధికారులను ఆదేశించారు. గురువారం అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బీసీ గురుకులాలను ఆమె ఆకస్మిక